సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం : 29 : మే : 2025



రావిలంకలో విషాద ఛాయలు

ఆచంట మండలం రావిలంక వద్ద గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలుర మృతదేహాలు బుధవారం లభ్యం కాగా ఆ ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. 8లో ▸



అడుగంటిన మంచినీటి చెరువులు

పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటాయి. దీంతో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. 8లో ▸



14న అయోధ్య-కాశీ యాత్ర

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జూన్ 14 నుంచి 22 వరకు అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఏరియా మేనేజర్ తెలిపారు. 8లో ▸

పడకేసిన పల్లె పాలన

- కూటమి పాలనలో గ్రామ వ్యవస్థలు నిర్వీర్యం
- అలంకారప్రాయంగా సచివాలయాలు, ఆర్బీకేలు
- సేవలందక ప్రజలు, రైతులకు ఇక్కట్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన సేవలు
- రూ. 259 కోట్లతో 865 సొంత భవనాలు
- 5266 సచివాలయ ఉద్యోగులు, 8,616 వలంటీర్లతో ఇంటింటికీ సేవలు



తాడేపల్లిగూడెం రూరల్ మెట్ట ఉప్పరగూడెంలో సిబ్బంది లేక వెలవెలబోతున్న సచివాలయం

సాక్షి, భీమవరం: ప్రజల వద్దకు పాలన, సంక్షేమానికి శ్రీకారం చుడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు మండల, జిల్లా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో పాలనను చెంతకు చేర్చారు. అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే), వైద్యసేవల కోసం హెల్త్ క్లినిక్‌లను తెచ్చింది. వాటి కోసం ఊరూరా ప్రత్యేక భవన నిర్మించింది. గ్రామ స్వరాజ్యానికి ఊపిరిలూదిన ఈ వ్యవస్థల్ని కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తోంది. సేవలందించలేక సచివాలయాలు అలంకార ప్రాయంగా మారాయి. ఆర్‌బీకేలు మూతపడుతున్నాయి. హెల్త్ క్లినిక్‌ల్లో వైద్యసేవలు కుంటుపడ్డాయి. ఆరేళ్ల కిందట పంచాయతీల్లో చాలావరకు సెక్రటరీ, బిల్ కలెక్టర్, అటెండర్ మాత్రమే ఉండేవారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు వ్యయప్రయాసల కోర్చి మండల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. 2019 అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థకు జీవం పోశారు. గ్రామాల్లో రెండు వేలు, పట్టణాల్లో నాలుగు వేల జనాభా ప్రాతిపదికన జిల్లాలో 535 సచివాలయాలు ఏర్పాటు చేశారు. గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, అగ్రికల్చర్ అసిస్టెంట్, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్, ఉద్యానవన అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ తదితర పోస్టులను ఏర్పాటు చేశారు. తద్వారా జిల్లాలో ఐదు వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. 35 శాఖలకు చెందిన 500కు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. సచివాలయాలకు అనుబంధంగా 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున 8,616 మందిని నియమించారు.



ఉండిలోని రైతు భరోసా కేంద్రంలో పోలీస్ స్టేషన్



పాలకోడేరు సచివాలయంలో తహసీల్దార్ కార్యాలయం

సచివాలయ ఉద్యోగులకు ఇక్కట్లు : కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలను నిర్వీర్యం చేస్తోంది. చాలావరకు సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. వలంటీర్లను తొలగించగా, సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులకు ప్రత్యామ్నాయ పనులు పురమాయిస్తోంది. జిల్లాలోని సచివాలయాల్లో 1,066 ఖాళీ పోస్టులు ఉండగా వాటిని భర్తీ చేయకుండా క్లస్టర్ల పేరిట ఉద్యోగులను క్రమబద్ధీకరించి మిగిలిన వారిని ఇతర శాఖల్లో భర్తీ చేసే యోచన చేస్తోంది.

సొంత భవనాల నిర్మాణం

గ్రామీణ వ్యవస్థల కోసం గత ప్రభుత్వం సొంత భవనాలను సమకూర్చింది. ఉద్యోగులు, ప్రజావసరాలకు అనుగుణంగా వీటిని ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున జిల్లాలో 353 భవన నిర్మాణాలకు సుమారు రూ.141.2 కోట్లు మంజూరు చేసింది. వీటిలో 270 భవనాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆర్బీకేకు రూ. 22 లక్షలు చొప్పున రూ.65 కోట్ల వ్యయంతో 298 భవన నిర్మాణం చేపట్టగా గత ప్రభుత్వంలోనే 211 భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చారు. ఒక్కో హెల్త్ క్లినిక్‌కు సుమారు రూ.25 లక్షల చొప్పున జిల్లాలోని రూ.53.5 కోట్లతో 214 భవనాలు చేపట్టి 96 భవనాలు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చారు. కూటమి వచ్చాక మిగిలిన వాటిని పూర్తిచేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి.

మాది నరసాపురం మండలం సరిపల్లి గ్రామం. రెండు ఎకరాల సొంత పొలంతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. దాళ్వాలో 1053 రకం సాగుచేయగా ధాన్యం కొనుగోలుకు చాలా ఇబ్బంది పెట్టారు. ఆఖరుకు క్వింటాకు మూడు కిలోలు తగ్గించి కొన్నారు. డబ్బులు ఇప్పటికీ అకౌంట్‌లో వేయలేదు. మళ్లీ రైతుభరోసాకు దరఖాస్తు చేయమని చెపితే రెండు రోజుల నుంచి గ్రామంలో సచివాలయానికి తిరుగుతున్నాను. ఎవరూ సమాధానం చెప్పడంలేదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలాంటి ఇబ్బంది లేదు. వలంటీర్లు ఉండేవారు, మరోపక్క సచివాలయం, ఇంకో పక్క రైతుభరోసా కేంద్రం ఉండేది.



– జొన్నాద అప్పారావు

గత ప్రభుత్వంలో పార్టీలకతీతంగా పథకాలు



గత ప్రభుత్వం కుల మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా.. గత ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాల్లో ఇతర కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

– గొంతే హరీష్, పాందువ్వ, ఉండి మండలం

వైద్య సేవలు బంద్



గతంలో వైద్య సేవలు ఇంటి ముందుకు వచ్చేవి. ప్రతి నెల వైద్యులు వచ్చి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని అవసరమైన మందులు ఇచ్చేవారు. అప్పటి మాదిరిగా ఇప్పటి ప్రభుత్వంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నాం.

– తామరపల్లి ముసలయ్య, పెద్దిరెడ్డిపాలెం, ఇరగవరం మండలం

ఇంటింటికి వైద్య సేవలు ఎక్కడ?



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు. గతంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుతోపాటు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వైద్య సేవలు అందించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

– చిట్టూరి లక్ష్మి, వీరవాసరం

ఆర్బీకేలు నిర్వీర్యం



గతంలో ఆర్బీకే ద్వారానే అన్ని సేవలు అందించేవారు. ఇప్పుడు ఎలాంటి మందులు ఇవ్వడం లేదు. సమాధానం చెప్పేవారు కూడా ఉండటం లేదు. ఎరువులు, పురుగు మందులు కమిషన్ వ్యాపారి వద్ద తెచ్చుకుంటున్నాం.

– సేలంశెట్టి నాగేశ్వరరావు, రైతు, ఎల్ అగ్రహారం

అన్నదాతలకు అండగా ఆర్బీకేలు

అన్నదాతల అండగా ఆర్బీకే వ్యవస్థను తెచ్చి సాగులో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు రైతులకు భరోసా కల్పించారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులతో పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం అందించడంలో కీలకపాత్ర పోషించాయి. ఆర్బీకేలను రైతుసేవా కేంద్రాలుగా కూటమి సర్కారు మార్చింది. కొన్ని ఆర్బీకే భవనాలు ఇతర కార్యాలయాలకు వినియోగిస్తుండగా, మరికొన్ని తాళం వేసి కనిపిస్తున్నాయి. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉండిలోని ఆర్‌బీకేను పోలీస్ స్టేషన్‌గా మార్చగా పాలకోడేరు సచివాలయ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయంగా మార్చారు.



గత ప్రభుత్వంలో నరసాపురం రూరల్ సీతారాంపురంలోని ఒకే ప్రాంగణంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు

నాడు పల్లె వైద్యానికి పెద్దపీట

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆధునిక వసతులతో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేసింది. వైద్యుడి రూమ్, ల్యాబ్, స్థానికంగా వైద్య సిబ్బంది నివాసం ఉండేందుకు, ఇతర వసతులతో వీటి నిర్మించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, మంచాన పట్టిన వారికి ఇంటికి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శిబిరాల నిర్వహణ లేకపోవడంతో వైద్యంకోసం పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

న్యూస్‌రీల్

మద్యం అమ్మకాలు పారదర్శకంగా జరగాలి



కలెక్టరేట్‌లో మద్యం షాపులపై సమీక్షలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: మద్యం అమ్మకాలు పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, లిక్కర్ షాప్ యజమానులతో మద్యం సరఫరా, అమ్మకాలు వంటి అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ముందుగా మద్యం అమ్మకాలపై షాపు యాజమానుల ఇబ్బందులు తెలుసుకున్నారు. లిక్కర్ విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అమ్మకాలు పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్ఎస్ కుమరేశ్వరన్, డిపో మేనేజర్ ఎల్.రంగారెడ్డి పాల్గొన్నారు.

ఆక్వాకు పంట విరామం



ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటించిన రైతు పెన్మెత్స సత్యనారాయణ రాజు

యలమంచిలి: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన ఆక్వా రైతు, సొసైటీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు బుధవారం ఆక్వా క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఆక్వా చెరువులు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల రొయ్య దిగుబడి బాగుంటున్నా ధర పతనం కావడం, మేతలు, మందుల ధరలు పెరిగిపోవడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీంతో జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం పిలుపు మేరకు పోడూరు మండలం అప్పనచెరువు పంచాయతీ రాజులగరువులో తాను సాగు చేస్తున్న 30 ఎకరాల ఆక్వా చెరువులకు పంట విరామం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



రిమాండ్ ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

తణుకు అర్బన్: రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు న్యాయవాదిని పెట్టుకోలేని పరిస్థితుల్లో ఉంటే మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచేస్తామని న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాద్ అన్నారు. బుధవారం తణుకు సబ్‌జైలుతోపాటు మానసిక ఆస్పత్రులైన ప్రియాంక నర్సింగ్‌హోమ్, భవానీ నర్సింగ్ హోంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దాయిలంతా రిమాండ్ అనంతరం బెయిల్‌పై బయటకు వెళ్లాక తమ ప్రవర్తనలో మార్పు వచ్చేలా నడుచుకోవాలన్నారు. జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వసతి, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. మానసిక ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై చర్చించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని ఉప జిల్లా రెవెన్యూ డివిజినల్ అధికారి కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సలహా సంఘం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంత ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో యోగా రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జేసీ ఆదేశించారు. బుధవారం యోగా సిటిజన్ రిజిస్ట్రేషన్, మాస్టర్ ట్రైనర్స్ టు ట్రైనర్స్ మ్యాపింగ్, యోగా పోటీలు, తదితర అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

తణుకులో కోవిడ్ కలకలం!

- వృద్ధురాలికి పాజిటివ్ వచ్చినట్లు ప్రచారం
- పైడిపర్రులో ప్రత్యేక శానిటేషన్



పైడిపర్రులో బ్లీచింగ్ చిమ్ముతున్న పారిశుధ్య కార్మికుడు

తణుకు అర్బన్: కోవిడ్ అనుమానిత లక్షణాలతో చికిత్స పొందుతున్న తణుకుకు చెందిన వృద్ధురాలికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. పట్టణంలోని పైడిపర్రుకు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు ఇటీవల చార్‌ధామ్ యాత్రకు వెళ్లి వచ్చాక గత మూడు రోజులుగా అనారోగ్యం బారిన పడ్డారు. ఈ నెల 27న తణుకులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం కోవిడ్ అనుమానిత లక్షణాలతో రాజమండ్రికి తరలించగా అక్కడ చేసిన ర్యాపిడ్ కిట్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు సమాచారం. దీంతో మెరుగైన వైద్యసేవలకు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ యాత్రలకు పైడిపర్రు నుంచి 15 మంది వరకు వెళ్లారని ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం. కోవిడ్ పాజిటివ్ అన్న సమాచారంతో బుధవారం ఉదయం మున్సిపల్ శానిటరీ అధికారులు పైడిపర్రులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ విషయంపై వైద్య శాఖ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. ఈ విషయంపై డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయిని వివరణ కోరగా కోవిడ్ లక్షణాలున్న వృద్ధురాలికి తణుకులో ఎలాంటి పరీక్షలు చేయలేదని, ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆరోగ్యం నిలకడగానే ఉందన్నారు. పరీక్షకు సంబంధించిన రిపోర్టు గురువారం వస్తుందని చెప్పారు. మునిసిపల్ అధికారులు శానిటేషన్ చేయించారు తప్ప.. వైద్యశాఖ నుంచి ఎలాంటి జాగ్రత్తలు, అవగాహన కల్పించకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టని యంత్రాంగం

కోవిడ్ పాజిటివ్ వచ్చిందనే సంకేతాలు ఉన్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం. దీంతో జలుబు, దగ్గు, ఆయాసం సమస్యలు ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు. కోవిడ్ పరీక్షలు పశ్చిమగోదావరి జిల్లాలో అందుబాటులో లేవు. పరీక్షలు, సంబంధించిన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ రూపొందించపోవడాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కోవిడ్ కేసు నమోదు కాకుండానే పరీక్షలు నిర్వహించే కిట్‌లు, జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు, వార్డుల్లో బెడ్స్ అందుబాటులో ఉంచారు. ఆక్సిజన్ వంటి ఏర్పాట్లు చకచకా చేశారు. కడప ప్రాంతంలో కూడా కోవిడ్ కేసులు నమోదయ్యాయనే వార్తలు రాగా.. తణుకు నుంచి మహానాడుకు టీడీపీ శ్రేణులు వెళ్లడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎంపీపీగా ధనలక్ష్మి బాధ్యతల స్వీకరణ



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ధనలక్ష్మి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండల ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కోర్టు ఉత్తర్వులతో జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో ఆమె వైఎస్సార్‌సీపీ తరఫున ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నికైన సంగతి తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా మండలంలో అన్ని వర్గాలను కలుపుకుని మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎంపీపీగా ఈ రోజు బాధ్యతలు స్వీకరించడానికి ప్రధాన కారణం తన వెంట ఉన్న ఎంపీటీసీ సభ్యులన్నారు. వారిని ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన వెరవకుండా తన వెంట నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా ఆమె స్వగ్రామం ఏనుగువానిలంక నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా మండల పరిషత్ కార్యాలయం చేరుకున్నారు. పూజ కార్యక్రమం అనంతరం ఎంపీపీ కుర్చీలో కూర్చుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తోపాటు పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, నాయకులు పొత్తూరి బుచ్చిరాజు, గుడాల సాయి బాలాజీ, చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య), బోనం బులివెంకన్న, ఓదూరి భాస్కరరావు, చివటపు నాగేశ్వరరావు, ముదునూరి లక్ష్మీపతిరాజు, బొంతు కర్ణారెడ్డి, ఇలపకుర్తి నరసింహరావు, పొత్తూరి రంగరాజు, నిమ్మకాయల రామకృష్ణ, మంద హరికుమార్, మోకా నరసింహరావు, గుడాల సురేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, మానుకొండ సోమరాజు, కోరాడ శ్రీనివాసరావు, జోగాడ ఉమామహేశ్వరరావు తదితరులు పూలమాల, శాలువాలతో సత్కరించారు.

ధాన్యం మద్దతు ధర కంటి తుడుపే



పెదపాడు మండలంలోని వట్లూరులోని గ్రంథాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెదపాడు: ఖరీఫ్, రబీ పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపు చర్యేనని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పెదపాడు మండలంలోని వట్లూరు గ్రంథాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో మద్దతు ధరలపై సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్పత్తి ఖర్చులు తక్కువ చూపి కేంద్ర ప్రభుత్వం ధరలు ప్రకటించడం వల్ల రైతులకు కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు వాస్తవ ఖర్చులు లెక్కకట్టి ఉత్పత్తి ఖర్చుకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన సాంబశివరావు, కొమ్మనేని అచ్యుతరావు, కొల్లిపర కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపుల్లోనే సరుకులు



శృంగవృక్షంలో రేషన్ షాప్ తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాలకోడేరు: జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్ద నిత్యావసరాలు పంపిణీ చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ తెలిపారు. బుధవారం పాలకోడేరు మండలం శృంగవృక్షంలో రేషన్ షాపు నెంబర్ 11ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్డుదారులందరూ రేషన్ షాపులు వద్దకు వచ్చి నిత్యావసరాలు తీసుకోవాలని అన్నారు. అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులు పొందవచ్చన్నారు. వికలాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులను అందజేయాలని డీలర్లను ఆదేశించారు.

ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అకాడమీ అధికారులు

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2025–26 ప్రవేశాల్లో భాగంగా ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించారు. క్యాంపస్‌లోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో ఉన్న ఆడిటోరియంలో ఏర్పాట్లు చేశారు. తొలిరోజు సైనికోద్యోగుల పిల్లల కోటాలో 119 మంది అభ్యర్థులు, క్రీడా కోటాలో 227 మంది హాజరయ్యారు.

బదిలీల ఆలస్యంతో ఉపాధ్యాయులపై ఒత్తిడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల బదిలీలు షెడ్యూల్ మేరకు జరగకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తిస్థాయిలో రూపొందించకపోవడం వల్ల దరఖాస్తు చేసే సందర్భంలో గందరగోళానికి గురయ్యారన్నారు. ఆ తరువాత షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రొవిజనల్ సీనియారిటీ లిస్టులు విడుదల చేయకపోవడం వల్ల తమ పేరు ఎక్కడ ఉందోనని తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఖాళీల వివరాలను కూడా ప్రకటించలేదు.

సేంద్రీయ ఉత్పత్తులపై నమ్మకం పెంచాలి

ఏలూరు(మెట్రో): సేంద్రీయ ఉత్పత్తులపై నమ్మకం పెరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్ బాషా అన్నారు. ఏలూరు వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సేంద్రీయ దుకాణాలు, ఎన్‌పీఎం ఉత్పత్తులపై రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ, ప్రకృతి విధానంలో ఉత్పత్తి చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ పరిధిని విస్తరించే మార్గాలను పరిశీలించాలన్నారు. ఉత్పత్తులు పర్యావరణానికి ఉపయోగకరంగా ఉండేలా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా

క్లుప్తంగా

విద్యుత్‌ షాక్‌తో యువకుడి మృతి


ప్రభు కిరణ్‌(ఫైల్‌)

చాట్రాయి: ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌ తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన పరసా ఈశ్వరరావు ఇంటి పక్కన ఉన్న 11 కేవీ వైరు ఇంటి సర్వీస్‌ వైరుపై పడి ఇల్లంతా విద్యుత్‌ ప్రసారం అయ్యింది. ఆ సమయంలో గదిలో నిద్రపోతున్న పరసా ప్రభు కిరణ్‌(18) లేచి బోర్డులో స్విచ్‌ ఆపుతుండగా విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఐ రామకృష్ణ తెలిపారు.

గోదావరిలో దూకిన యువకుడి గల్లంతు

యలమంచిలి: మండలంలోని చించినాడ వశిష్ట గోదావరి వంతెన మీద నుంచి దూకి యువకుడు గల్లంతైనట్లు ఎస్సై కె గుర్రయ్య తెలిపారు. వంతెనపై దొరికిన బైక్‌, సెల్‌ఫోన్‌ ఆధారంగా అతడు భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన షేక్‌ కాసు (24)గా అనుమానిస్తున్నారు. ఈ మేరకు షేక్‌ కాసు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

ఎక్సైజ్‌ కేసుల్లో నలుగురి బైండోవర్‌


తహసీల్దార్‌ ఎదుట వ్యక్తులను బైండోవర్‌ చేసిన దృశ్యం

భీమవరం: ఎక్సైజ్‌ కేసులకు సంబంధించి భీమవరం మండలంలోని నలుగురు వ్యక్తులను బుధవారం భీమవరం తహసీల్దార్‌ ఆర్‌ రాంబాబు వద్ద బైండోవర్‌ చేసినట్లు భీమవరం ఎక్సైజ్‌ సీఐ కె బలరామరాజు చెప్పారు. బైండోవర్‌ చేసిన వారిలో ఇళ్ల శ్రీనివాసరావు, యెలుదూటి నాగన్న, యల్ల శేఖర్‌, బడుగు రవి ఉన్నారన్నారు. వీరు ఏడాది కాలంలో మరోసారి ఎక్సైజ్‌ నేరంలో పట్టుబడితే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భీమవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భీమవరం వన్‌టౌన్‌ పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 24వ తేదీన వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామానికి చెందిన కొడమంచిలి మేరీ(35) భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై భీమవరం వస్తుండగా పోలీసుబొమ్మ సెంటర్‌ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో మేరి తీవ్రంగా గాయపడగా గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. వన్‌టౌన్‌ ఎస్సై ఎస్‌వీవీఎస్‌ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

- గ్రామాల్లో దాహం కేకలు
- చెరువులను పూర్తిస్థాయిలో నింపకపోవడంతోనే సమస్య


చినఅమిరంలో అంబేద్కర్‌ సెంటర్‌ వద్ద అడుగంటిన మంచినీటి చెరువు


గొల్లవానితిప్పలో రక్షిత మంచినీటి చెరువు ఇలా..


గుట్లపాడు మంచినీటి చెరువులో పూర్తిగా లేని నీరు

భీమవరం అర్బన్‌: జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటాయి. దీంతో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. వేసవి ప్రారంభంలో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపకపోవడమే సమస్యకు కారణమని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప, కొత్తపూసలమర్రు, దొంగపిండి, గూట్లపాడు, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, పెదగరువు, బేతపూడి తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటాయి. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఫిల్టర్‌ బెడ్‌లు పనిచేయకపోవడంతో బురద నీటినే పంచాయతీ సిబ్బంది కుళాయిల ద్వారా అరకొర సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్‌ 15 తరువాత ఎప్పుడైనా పంటకాలువలు కట్టేస్తారు. ముందు జాగ్రత్తచర్యగా ఆర్‌డబ్ల్యూఎస్‌, పంచాయతీ, ఇరిగేషన్‌ శాఖల సమన్వయంతో మార్చి నెలాఖరు నుంచే రక్షిత మంచినీటి చెరువులు తాగునీటిని నింపాల్సి ఉంది. అయితే ఈ ఏడాది పెదగరువు, బేతపూడి గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువుల్లోను పూడిక తీత పనులు నిర్వహించడం, మిగిలిన గ్రామాల్లో ఏప్రిల్‌ చివరి వరకు తాగునీటి చెరువులను నింపకపోవడంతో మే నెల గడవకముందునే రక్షిత మంచినీటి చెరువులు అడుగంటాయి. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో వాడుక చెరువులలో నీటిని సైతం నింపకపోవడంతో అటు తాగునీటికి, ఇటు వాడకానికి నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుళాయిల ద్వారా అరకొర సరఫరా

పంచాయతీ సిబ్బంది రోజుకు గంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని, ఆ నీరు కూడా బురదమయంగా ఉంటోందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో 20 లీటర్ల మినరల్‌ వాటర్‌ రూ.30 నుంచి రూ.35కు కొనుగోలు చేసి తాగుతున్నామని, స్తోమత లేనివారు కుళాయిల ద్వారా వచ్చే బురదనీటినే తాగి అనారోగ్యాల పాలవుతున్నామని బాహాటంగానే చెబుతున్నారు.

బురద నీరు వస్తుంది



కుళాయిల ద్వారా రోజుకు ఒక గంట మాత్రమే తాగునీరు ఇస్తున్నారు. అది కూడా బురదగా వస్తుంది. ఇంటి వాడకానికే తప్ప తాగడానికి ఆ నీరు పనికి రావడం లేదు. డబ్బులుంటే మినరల్‌ వాటర్‌ కొనుక్కుని తాగుతున్నాం. లేకుంటే ఆ నీటినే తాగాల్సి వస్తుంది.

– మేకం సోమన్న, గ్రామస్తుడు, గొల్లవానితిప్ప

గంట మాత్రమే ఇస్తున్నారు



గ్రామానికి శివారు కావడంతో రోజుకు గంట మాత్రమే తాగునీటిని ఇస్తున్నారు. ఇంటింటికి కుళాయిలు ఇవ్వలేదు. పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే నీటినే తెచ్చుకుంటున్నాం. అవి మురికిగా వస్తున్నాయి.

– దేవిరెడ్డి వెంకటలక్ష్మి, గృహిణి, హౌసింగ్‌ కాలనీ, గొల్లవానితిప్ప

సినిమా థియేటర్ల తనిఖీలు


తాడేపల్లిగూడెంలో సినిమా థియేటర్‌ను తనిఖీలు చేస్తున్న తహసీల్దార్‌

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సినిమా థియేటర్లను బుధవారం తహసీల్దార్‌ ఎం.సునీల్‌ కుమార్‌ తనిఖీ చేశారు. థియేటర్లలో సదుపాయాలపై ఆరా తీశారు. హాల్స్‌ వద్ద విక్రయించే తినుబండారాల ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. ప్రేక్షకుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెనుగొండలో..

పెనుగొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు పెనుగొండ మినర్వా థియేటర్‌ను తహసీల్దారు జి అనితకుమారి బుధవారం తనిఖీ చేశారు. సైకిల్‌ స్టాండ్‌, సినిమా హాలులో తినుబండారాల ధరలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వద్దని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రావిలంక తీరంలో విషాద ఛాయలు

బాలుర మృతదేహాలు లభ్యం


విగతజీవులుగా మారిన బాలురు


గోదావరి నుంచి బాలుర మృతదేహాలను బయటకు తీస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది

పెనుగొండ: ఆచంట మండలం రావిలంక గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలుర మృతదేహాలు బుధవారం లభ్యం కాగా తీరప్రాంతమంతా విషాద ఛాయలు అలుముకున్నాయి. అంబేద్కర్‌ కోనసీమ జిల్లా గన్నవరం మండలానికి చెందిన కేతా ప్రవీణ్‌ (15), సానబోయిన సూర్యతేజ (12), పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి పెదలంకకు చెందిన నీతిపూడి పాల్‌కుమార్‌ (15) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రావిలంక గోదావరిలో మంగళవారం సరదాగా స్నానానికి వచ్చారు. అమావాస్య కారణంగా గోదావరికి సముద్రపు పోటు తగలడంతో నీటిమట్టం పెరిగి ముగ్గురు బాలురకు ఈత రాకపోవడంతో గల్లంతయ్యారు. బయట పడిన మరో ఇద్దరు బాలురు ఘటనా స్థలం నుంచి హుటాహుటిన వారి తల్లిదండ్రుల వద్దకు చేరి సమాచారం అందించారు. దీంతో మంగళవారం రాత్రి పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందం గాలింపులో తొలుత కేతా ప్రవీణ్‌ మృతదేహం లభ్యం కాగా అనంతరం సానబోయిన సూర్యతేజ మృతదేహం లభ్యమైంది. అయితే నీతిపూడి పాల్‌కుమార్‌ మృతదేహం కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందం శ్రమించాల్సి వచ్చింది. చివరకు యలమంచిలి మండలం కనకాయలంక సమీపంలో అతడి మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు కోనసీమ జిల్లా రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి మృతదేహాలను తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పెనుగొండ సీఐ రాయుడు విజయభాస్కర్‌ ఆధ్వర్యంలో ఆచంట, గన్నవరం ఎస్సైలు కేవీ రమణ, శివకృష్ణ, తహసీల్దారులు జి కనకరాజు, శ్రీపల్లవి మృతదేహాలు లభ్యమయ్యే వరకూ ఘటనా స్థలంలోనే ఉండి పర్యవేక్షించారు. బాలుర మృతితో రావిలంక వద్ద తీరమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మృతదేహాల గాలింపు చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టుపై వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఒక మహిళ కంట్లో కారం కొట్టి ఆమె మెడలోని సూత్రాలతో సహా బంగారు గొలుసుని దోపిడీ చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు సర్కిల్‌ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన మునగాల జానకీ దేవి, ఆమె భర్త శ్రీరామశాస్త్రి ప్రభుత్వ టీచర్‌లుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇల్లు మరమ్మతుల నిమిత్తం తాపీ పనివారిని పెట్టుకున్నారు. ఈ నెల 23న తాపీ పనిచేసేందుకు పేరంపేటకు చెందిన చింతపల్లి రామాంజనేయులు అలియాస్‌ అంజిబాబు, నక్కా శ్రీను అలియాస్‌ పండు, యడ్లపల్లి విజయరాజు వచ్చారు. వారు పని ప్రారంభించగా శ్రీరామశాస్త్రి టిఫిన్‌ తెచ్చేందుకు బయటకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ఆ ముగ్గురు జానకీ దేవి కంట్లో కారం కొట్టి నాలుగు కాసుల బంగారు గొలుసు, మంగళసూత్రాలతో సహా దోచుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులను సీఐ కృష్ణబాబు అరెస్ట్‌ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టుకు సంబంధించి ఎస్సై షేక్‌ జబీర్‌ ఏఎస్సై ఎస్‌వీ సంపత్‌కుమార్‌, కానిస్టేబుళ్లు ఎన్‌.రమేష్‌, రాజశేఖర్‌ సహకరించగా, వీరిని డీఎస్పీ రవిచంద్ర అభినందించారు. సమావేశంలో సీఐ కృష్ణబాబు, ఎస్సై షేక్‌ జబీర్‌ పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలి


కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న ఏపీఎన్‌జీవోస్‌ నాయకులు

ఏలూరు(మెట్రో): జీవో 23 ప్రకారం ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్‌జీవోస్‌ నాయకులు కోరారు. బుధవారం కలెక్టర్‌ వెట్రిసెల్వి ని మర్యాదపూర్వకంగా కలుసుకుని బదిలీ ప్రక్రియపై విన్నవించారు. ఏపీ ఎన్‌జీవోస్‌ అసోసియేషన్‌లో ఉన్న ఆఫీస్‌ బేరర్స్‌కి అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోల ప్రకారం బదిలీలు చేసేలా ప్రతి శాఖాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ స్పందిస్తూ జిల్లా రెవెన్యూ అధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఇటీవల గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్‌ సెక్రెటరీలకు పదోన్నతులు కల్పించాలని కోరగా, ఏఎన్‌ఎంల పదోన్నతుల ఫైల్‌ను ఆమోదించినందుకు కలెక్టర్‌కు పూలమొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవోస్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్‌, కార్యదర్శి నెరుసు రామారావు, ఎన్‌జీవోస్‌ నాయకులు, హెల్త్‌ సెక్రటరీలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు


మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే

నూజివీడు: గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ధర లేక మామిడి రైతులు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్‌ అప్పారావు పేర్కొన్నారు. దీంతో మామిడి రైతులు నష్టాల్లో కూరుకుపోయారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారాన్ని చెల్లించి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగినపల్లి, తోతాపురి, రసాలు తదితర రకాలకు ధరలు దారుణంగా పడిపోయాయని, దీంతో కోతకూలి, కిరాయిలు కూడా రాని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. తోతాపురి కాయలు టన్ను కేవలం రూ.3వేల నుంచి రూ.4వేలు ధర మాత్రమే ఉందని, దీంతో కాయలు కోయడానికి ఎదురు పెట్టుబడి అవుతోందని రైతులు కోతలు కూడా కోయడం లేదన్నారు. చిత్తూరు జిల్లాలో జ్యూస్‌ ఫ్యాక్టరీలు ఇంత వరకు తెరవకపోవడంతో తోతాపురి కాయలను కొనేవారే లేరని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా మామిడి రైతులు నిండా మునిగిపోయారన్నారు. పూతలు, పిందెలు నిలుపుకునేందుకే రైతులు పురుగుమందులు పిచికారీ చేసేందుకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. అలాగే ఎరువులు, దుక్కి ఖర్చు, తోటల కాపలా ఖర్చు అన్నీ చూసుకుంటే రూ.50 వేలు పెట్టుబడి అయిందని, ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లిస్తేనే రైతులు గట్టెక్కుతారన్నారు. మామిడి రైతులు ఎంతో దారుణమైన పరిస్థితుల్లో ఉన్నప్పటికీ వారిని పట్టించుకునే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేకపోవడం దురదృష్టకరమన్నారు. హైదరాబాద్‌, బెంగళూరు, చెన్నై, విజయవాడ, వరంగల్‌, రాజమండ్రి, విశాఖపట్నం వంటి నగరాల్లో నూజివీడు చిన్నరసం పేరుతో బోర్డులు పెట్టి వేరే ప్రాంతాల్లో కాసిన కాయలను విక్రయిస్తున్నారని, దీనిని బట్టే నూజివీడు ప్రాంతం మామిడికి ఎంతో ప్రసిద్ధో అర్థమవుతుందన్నారు. అంతటి ప్రాధాన్యం ఉన్న మామిడిని సాగు చేస్తున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

14న అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్‌ రాజా

ఏలూరు (టూటౌన్‌): భారతీయ రైల్వేస్‌ అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జూన్‌ 14 నుంచి 22 వరకు అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర నిర్వహిస్తున్నట్లు సంస్థ విజయవాడ ఏరియా మేనేజర్‌ ఎం.రాజా తెలిపారు. ఈమేరకు ఈ యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం స్థానిక రైల్వేస్టేషన్‌ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ అయోధ్య–కాశీ యాత్రలో భాగంగా వారణాసి, అయోధ్య, ప్రయాగ్రా, నైమిశారణ్యం ప్రాంతాల్లోని పలు పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చునన్నారు. యాత్ర మొత్తం ఎనిమిది రాత్రులు, తొమ్మిది పగలు సాగుతుందన్నారు. ఈ నెల 14న సికింద్రాబాద్‌ నుంచి ప్రారంభమయ్యే రైలు విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని మీదుగా వెళుతుందన్నారు. టిక్కెట్ల బుకింగ్‌ కొరకు ఐఆర్‌సీటీసీ, రైల్వే రిటైరింగ్‌ రూమ్‌ దగ్గర, విజయవాడ రైల్వే స్టేషన్‌ నందు గాని ఆన్‌లైన్‌ నందుగాని చేసుకోవచ్చునన్నారు. వివరాలకు సెల్‌ నెం .9281495848 నందు సంప్రదించాలని కోరారు.

కోకో గింజల విక్రయానికి దరఖాస్తు చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవానంద్‌కుమార్‌

తాడేపల్లిగూడెం రూరల్‌: ప్రతి రైతు నుంచి ఎకరానికి 300 కిలోల కోకో గింజలను కొనుగోలు చేస్తామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్‌.దేవానంద్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం మండల మహిళా సమాఖ్య భవనంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కోకో గింజలు కిలోకు రూ.500 ధర నిర్ణయించిందన్నారు. ఈ ధరకు కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేస్తాయన్నారు. ఇందులో కిలోకు రూ.50 రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ వారికి చెల్లించడం ద్వారా ఈ పథకం అమలు చేస్తుందన్నారు. కోకో రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్‌ 30వ తేదీలోగా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

పాలకొల్లు సెంట్రల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాలకొల్లు పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రామయ్యహాలు జీప్లస్‌1 కాలనీకి చెందిన ప్రభాస్‌ (20) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉపాధి కోసం అతని తండ్రి కర్ణాటకలోను, తల్లి గల్ఫ్‌ దేశానికి వెళ్లారు. తన కుటుంబానికి ఏవిధంగాను సహకారం అందించలేకపోతున్నాననే మనస్థాపంతో ప్రభాష్‌ మంగళవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభాస్‌ మేనత్త ఫిర్యాదు మేరకు ఎస్సై జి పృథ్వీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తండ్రి కర్ణాటక నుంచి బుధవారం రావడంతో పంచనామ అనంతరం మృతదేహాన్ని అతనికి అప్పగించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్‌

భీమవరం: పోక్సో కేసులో నిందితుడు అడిదెల రంగనాథ్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ జి కాళీచరణ్‌ చెప్పారు. రాయలం గ్రామంలో ఇంటి దగ్గర ఆడుకుంటున్న మైనర్‌ బాలికకు స్వీట్లు ఇస్తానని చెప్పి ఇంటిలోనికి తీసుకువెళ్లి రంగనాథ్‌ అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక పారిపోయి విషయం తల్లికి చెప్పింది. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

వైఎస్సార్‌ విగ్రహం పాక్షిక ధ్వంసం


పెంటపాడులో ఎడమచేయి ధ్వంసమైన వైఎస్సార్‌ విగ్రహం

పెంటపాడు: పెంటపాడులోని వెలంపేట కోనేరు చెరువు వద్ద దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని బుధవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. విగ్రహం ఎడమ చేయి మోచేతి వరకూ విరిగి కింద పడి ఉంది. గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బర్ల జయ రాంబాబు ఈ విషయాన్ని ముందుగా గుర్తించారు. మంగళవారం రాత్రి వరకూ విగ్రహం బాగానే ఉందని, ఉదయం చూస్తే ఇలా చేయి విరిగి పడి ఉందని వైఎస్సార్‌ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. కడపలో టీడీపీ మహానాడు జరుగుతున్న సమయంలో ఇక్కడ వైఎస్సార్‌ విగ్రహం ధ్వంసం కావడం చర్చనీయాంశమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగనమోహన్‌రెడ్డి జిల్లాలో ఓదార్పు యాత్ర చేసిన సమయంలో ఈ విగ్రహాన్ని స్వయంగా ఆవిష్కరించారు. విగ్రహం జీవ కళ ఉట్టిపడేలా ఉందని శిల్పిని, నిర్వాహకులను అభినందించారు. అప్పటి నుంచి ఇక్కడ పలు కార్యక్రమాలను వైఎస్సార్‌ అభిమానులు నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

పెంటపాడు: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం పాలైన ఘటన బుధవారం తాడేపల్లిగూడెం– భీమవరం రోడ్డులో ముదునూరు వద్ద జరిగింది. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాలివి. గూడెం మండలం ఆరుగొలనుకు చెందిన అడ్డగర్ల సాయి రమేష్‌ (34) కరెంట్‌ పని చేస్తుంటాడు. బుధవారం పనినిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లి తిరిగి మోటార్‌ సైకిల్‌పై స్వగ్రామం వస్తుండగా ముదునూరు మలుపు వద్ద భీమవరం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో రమేష్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ


బోల్తా పడిన ట్రాక్టర్‌

యలమంచిలి: అడవిపాలెం సచివాలయానికి సమీపంలో నిలుపుదల చేసి ఉన్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో బోల్తా పడింది. ఆ శబ్దానికి చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ప్రమాదం జరిగిన సమయానికి ఎవరూ లేకపోవడం వలన పెను ప్రమాదం తప్పింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ విలేకరి ప్రమాద ఘటనను ఫొటో తీయగా లారీ డ్రైవర్‌ దౌర్జన్యానికి దిగాడు. దీనిపై అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఆ లారీకి కనీసం నెంబర్‌ ప్లేట్‌ లేకపోవడం విశేషం. నంబర్‌ ప్లేట్‌ లేని లారీతో కూటమి నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులతో పాటు మైనింగ్‌, రవాణా శాఖ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నిట్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. అంతర్జాతీయ యోగా డే సన్నాహకాలలో భాగంగా బుధవారం ఏపీ నిట్‌లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. హిమబిందు, అసోసియేట్ డీన్ రాజేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలన్నారు. యోగావల్ల వత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. యోగాతో చదువుపై ఏకాగ్రత కలుగుతుందన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు కలిసి యోగాసనాలు వేశారు. ఆచార్యులు తలారి రేష్మా, శ్రీకాంత్, రాజేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



దుర్యోధన ఏకపాత్రాభినయనంలో కోపల్లె శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్ -1 శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జరిగాయి. రిసోర్స్‌పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, ఎం.పుష్పవతి, ఎ.జనార్ధనరావు, జి.బాపయ్యశర్మ, కేవీ సత్యప్రకాష్‌లచే కథలు, ఆటలు ఆడించడం, నీతి కథలు, ఇంగ్లీషు గ్రామర్, తదితర అంశాలను బోధించారు. కోపల్లె శ్రీనివాసరావుచే దుర్యోధన ఏకపాత్రాభినయనం చేసి నాటక రంగం, రంగస్థలం, వివిధ పాత్రలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్టు షాపు నిర్వాహకురాలు అరెస్ట్



తేతలిలో బెల్ట్ షాపు నిర్వాహకురాలిని అరెస్టు చేసిన ఎస్సై లక్ష్మి

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కట్టా సత్యవతి అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె నుంచి 6 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా బెల్ట్ షాపును గమనించి మహిళను అరెస్టు చేసినట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, కానిస్టేబుల్ కె.కనకదుర్గ పాల్గొన్నారు.

కొండ్రుప్రోలులో బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు



బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో బుధవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి ఆరు డ్యూటీ పెయిడ్ లిక్కర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి వివరించారు. ఎస్సైలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

పెంటపాడు: మండలంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు 102వ జయంతి వేడుక నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు టీడీపీ నాయకులు వీర్ల కృష్ణ, టీడీపీ మహిళా నాయకురాలు కొండ్రెడ్డి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన అందించిన సేవలను కొనియాడారు. డీటీ కాశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సేవలకు గ్రహణం

- కూటమి ప్రభుత్వంలో బోసిపోయిన సచివాలయాలు
- ఏడాది కావస్తోన్న అందని సేవలు
- రేషన్, ఆరోగ్య కార్డులు అందక తిప్పలు
- జగన్ హయాంలో పట్టణ, గ్రామాల అభివృద్ధి
- చరిత్రలో నిలుస్తున్న నిర్మాణాలు
- నేడు వలంటీరు వ్యవస్థ, ఎండీయూ వాహన సేవల తొలగింపు

తణుకు అర్బన్: ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు నేరుగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి సమస్యకు చెక్ పెట్టే విధంగా పట్టణ, గ్రామ ప్రాంతాల రూపురేఖలు మార్చేశారు. ముఖ్యంగా సంక్షేమం, వైద్య, పౌర సరఫరా సేవలు ఇంటి గడపలోకే తీసుకువచ్చి సమూల మార్పులు తీసుకువచ్చారు. ప్రజల వివిధ సమస్య పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసి సచివాలయాల ద్వారా ఇంటి గుమ్మంలోకే సేవలందించి చరిత్రలో నిలిచారు. పట్టణ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల మన్ననలు పొందారు. ఇలా పట్టణం, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించి ఆయా ప్రాంతాల కొత్తరూపు తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కింది. నాటి ప్రభుత్వ హయంలో సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు- నేడు ద్వారా పాఠశాలల భవన నిర్మాణాల రూపంలో చేసిన అభివృద్ధి కళ్ల ఎదుటే కనిపిస్తోందని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. ఏడాది గడిచినా ఇంతవరకు పెంచిన వెయ్యి పింఛన్ తప్ప చెప్పిన ప్రకారం సూపర్ సిక్స్ తదితర పథకాలు అమలు చేయలేదు.

సేవలకు మంగళం పాడిన కూటమి

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ పాతరోజులను ప్రజలకు అందించేందుకు తాపత్రయపడుతోంది. ఇందులో భాగంగా ముందుగా ప్రజలకు అత్యంత చేరువైన వలంటీరు వ్యవస్థకు మంగళం పాడింది. దీంతో పాటు ఇంటి గుమ్మంలోకి వైద్యసేవలు జాడేలేకుండా పోగా తాజాగా ఇంటి గుమ్మంలోకి వచ్చి రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహనాలను సైతం తొలగించింది. దీంతో ప్రజలకు నేరుగా అందే సేవలను తొలగించడంపై కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏ ధ్రువపత్రం కావాల్సి ఉన్నా వలంటీరు ద్వారా అయిపోయే పని నేడు సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇకపై రేషన్ దుకాణాల వద్ద క్యూలో నిలబడాల్సిందేనంటూ ఇప్పటికే ఏ చిన్న పని కావాలన్నా సచివాలయాల మెట్లు ఎక్కలేక కాళ్లు అరిగిపోతున్నాయని గతంలో ఈ అవస్థలు లేకుండా వలంటీర్లు ఇంటికి వచ్చి కాగితాలు తీసుకువెళ్లి పనిచేసి తీసుకువచ్చారంటూ కూటమి ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతూ జగన్ పారదర్శక పాలనపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



అత్తిలిలో వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన సచివాలయ భవనం

	సచివాలయాలు	ఆర్బీకేలు	విలేజ్ క్లినిక్‌లు
తణుకు	41	15	11
తణుకు మండలం			
అత్తిలి	20	13	11
ఇరగవరం	21	21	20

జగన్ రైతులు మెచ్చే పాలన అందించారు



గత జగన్ ప్రభుత్వ హయాంలో రైతాంగానికి పెద్దపీట వేశారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీల పాత్రలేకుండా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేయడమే కాకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోళ్లు చేస్తూ కిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో పంట నష్టపోతే ఆ పంట సమయంలోనే నష్టపరిహారం అందేది. రైతుభరోసాగా రూ.15వేలు ఏడాదికోసారి అందచేసి రైతుల మన్ననలు పొందారు.

– కోరుకొల్లు వెంకట్రావు, రైతు, కంచుమర్రు

పల్లె కన్నీరు పెడుతోంది

దిష్టిబొమ్మలుగా సచివాలయాలు

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పలు పథకాలను రద్దు చేస్తుండగా, మరి కొన్నింటిని పేర్లు మార్చివేస్తుంది. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సచివాలయం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం సేవలను సైతం ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సూపర్ సిక్స్ అంటూ అలవికాని హామీలతో మోసపుచ్చి అధికారం పీఠం అధిష్టించిన కూటమి ప్రభుత్వం ఏవో సాకులతో ప్రజలను మభ్యపరుస్తూనే ఉంది. వలంటీర్లు ఇంటికి వెళ్లి పోయారు. సేవల వికేంద్రీకరణలో భాగంగా వచ్చిన గ్రామ సచివాలయాలు ఇప్పుడు బోసిగా ఉన్నాయి. వెల్ఫేర్ సెక్రటరీకి పని లేకుండా ఉంది. వాకిట ముంగిటకు సేవలు దాదాపుగా అందడంలేదు. ఏ విషయం గురించి స్పష్టతతో చెప్పే జవాబుదారీతనం కనుమరుగైంది. అందరికి ఇళ్ల డోలాయమానంలో ఉన్నాయి. మళ్లీ స్థలాలు ఇస్తాం. ఇళ్ల కట్టుకోవాలి. దరఖాస్తులు ఇవ్వండనే కూటమి మార్కు వేసే ప్రయత్నం చేస్తున్నారు.రైతులకు అవసరార్థం విత్తనాలు అందడం లేదు. ఎరువులు సరేసరి. అవి అందడంలేదు. చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసే పాత పరిస్థితులు మళ్లీ వస్తున్నాయా అనిపిస్తున్నాయి.

గతాన్ని సింహావలోకనం చేసుకుంటే...

గతంలో గ్రామాల్లోను, పట్టణాల్లో సేవలు వాకిట ముంగిటకు చేరువయ్యాయి. గ్రామసచివాలయాల నుంచి మిల్క్ చిల్లింగ్ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చాయి గడచిన ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలోని రెండు మండలాలలో 53 గ్రామాల్లో ..రెండు మండలాలలో 47 గ్రామసచివాలయాలు, 47 ఆర్‌బీకెలు, 34 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటయ్యాయి.పూర్తి చేయని తొమ్మిది సచివాలయ భవనాలను అలానే ఉంచేశారు. ఆర్‌బీకెలు ఎనిమిది పూర్తికాలేదు. హెల్త్ క్లినిక్‌లు 17 నిర్మించనే లేదు. ఏడాదిగా వీటి ఊసేలేదు.



దర్శిపర్రులోని రైతుభరోసా కేంద్రం



గూడెం నియోజకవర్గంలోని మండలాలలో జగనన్న ఇళ్లు

ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ

అత్తిలి: మండలంలోని కొమ్మర గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్ధాంతి పర్యవేక్షణలో గ్రామ పురోహితులు కొంపెల్ల శ్రీరామచంద్రమూర్తి బ్రహ్మత్వంలో పలువురు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖరంపై నుంచి బూరెలు పోసారు. సీతారామ శాంతి కల్యాణం జరిపించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



సీతారామచంద్రస్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

స్వామివారిని దర్శించుకున్న మాజీ మంత్రి కారుమూరి

కొమ్మర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పునః ప్రతిష్ఠించిన సీతారామచంద్రమూర్తి స్వామిని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దర్శించుకున్నారు. కారుమూరికి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సీతారామచంద్ర స్వామివారిని కారుమూరి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సర్పంచ్ మంతెన రామసీత, ఉపసర్పంచ్ మన్యం దానారావు, పాలూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కునాథరాజు శ్రీహరిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగులపై యాజమాన్యం తీవ్ర పనిష్మెంట్లు ఇస్తు, ఉద్యోగుల అశాంతికి కారణమవుతుందని, దీని దృష్ట్యా ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన నాయకత్వంలో యాజమాన్యంతో దఫ, దఫాలుగా జరిగిన చర్చలలో కొన్ని అంశాలు సానుకూలంగా సాధించుకున్నట్లు యూనిటీ నాయకులు వెల్లడించారు. ఆర్టీసీ డిపో వద్ద జరిగిన సమావేశంలో బుధవారం వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ని విధిగా అమలు చేయాలని, హెల్త్ కార్డులు పనిచేయడం లేదని, మోటారు చట్టంను అమలు చేయాలని, పలు అంశాలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరిస్తామని చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు, భుజంగరావు, ఎం.ఎస్.బాబు, రవికుమార్, నారాయణ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద యూనిటీ సభ్యులు సమావేశం

ముగిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయం వద్ద బారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, భక్తులు స్వామి వారిని దర్శించి తరించాలని రమణ కోరారు.

యథేచ్ఛగా కొబ్బరి చెట్ల తొలగింపు

ఇరగవరం: మండలంలోని కావలిపురం గ్రామంలో కొబ్బరి చెట్లును యథేచ్ఛగా తొలగిస్తున్నారు. పంచాయతీలకు ఎక్కువగా ఆదాయం వచ్చే కొబ్బరి, మామిడి, అరటి వంటి చెట్లను పెంచబోయి చెట్లు తొలగించడం విడ్డూరంగా ఉంది. నిజనికి గతం ప్రభుత్వం హయంలో పంచాయతీలో వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు సర్పంచ్‌గా ఉండేవారు అప్పుడు పంచాయతీ డబ్బులతో భవిష్యత్‌లో ఆదాయం వస్తుంది అనే సదుద్దేశ్యంతో ఈ చెట్లు నాటించడం జరిగింది అప్పటి నుండి వాటిని పంచాయితీ అధికారులు సిబ్బంది సంరక్షిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు పేరు రాకుడదు అనే అధికారులను అడ్డ పెట్టుకుని కాపుకు దగ్గర పడ్డ కొబ్బరి చెట్లు నేల మట్టం చేస్తున్నారు అని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొబ్బరి చెట్లు తొలగించడానికి మండల తహసీల్దార్‌ను వివరణ కోరగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్నారు. దీనిపై ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణన్ని వివరణ కోరగా పెనుమంట్ర, ఇరగవరం, గోటేరు చానెల్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా అడ్డుగా ఉన్నా చెట్లును తొలగించడం జరుగుతుంది అన్నారు.



ఇరగవరం నుంచి కావలిపురం వెళ్లే రోడ్డు ప్రక్కన తొలగించిన కొబ్బరి చెట్లు

తణుకులో ఎమ్మార్పీఎస్ నాయకుల వేడుక



కేకు కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తణుకు అర్బన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ రావడం పట్ల తణుకు ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం తెలిపారు. బుధవారం తణుకు ఎన్టీఆర్ పార్కు వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు అబ్బదాసరి లాజర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ రావడం దళిత జాతికి వన్నె తెచ్చిందని, తమ జాతికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోలేమాన్‌మాదిగ, తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు కల్యాణ్ అబ్బదాసరి, జొన్నాడ సత్యనారాయణ, కడిమి శేఖర్, పువ్వల శ్రీకాంత్, నేకూరి కృష్ణ, ఉండ్రాజవరపు శ్రీను, కొల్లి శివ, చదలవాడ తిమోతి, ఉండ్రాజవరపు పండు, నాగూరి పెద్దిరాజు పాల్గొన్నారు.

‘ఆ స్థలం జోలికి వెళ్లవద్దు’

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో ఉన్న క్రిస్టియన్ సంస్థకు చెందిన భూమిలోకి ఎవరూ వెళ్లవద్దని, నగర పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్నికి తెలియజేసినట్లు హైకోర్టు లాయర్ అనురాధ చెప్పారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నగర పంచాయతీ సిబ్బంది వెళ్లి ఆ స్థలంలో పాక తొలగించే ప్రయత్నాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కమిషనర్‌తో మాట్లాడితే కోర్టులో ఉన్న విషయం తనకు తెలియదని, ఇకపై ఆ స్థలం జోలికి వెళ్లమని చెప్పినట్లు ఆమె వివరించారు. సీబీసీఎన్‌సీ ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఫాదర్, సంస్థ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు మాట్లాడుతూ క్రెగ్ దొర తమ సంస్థకు 1891లో కేటాయించారని చెప్పారు. బ్రాంచి చర్చిగా తాము ఉపయోగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏసురాజు, ఏసేబు, యాకోబు, జోసఫ్, పమ్ము, శేఖర్, ఎలీషా, ఆనంద్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతోమాట్లాడుతున్న హైకోర్టు లాయర్ అనురాధ

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

భీమవరం అర్బన్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు రెండు నెలలు గడుస్తున్నా నగదు చెల్లించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని పెదగరువు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీ పనులు చేస్తున్న వారిని సీఐటీయూ సంఘం సభ్యులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోజు వారి కూలీ రూ. 600, ఏడాదికి 200 పనిదినాలు పెంచాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ పనులు చేసిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టెం చిన్న యోహాను, పాలపర్తి చంద్ర పౌలు, వజ్రమ్మ, మేడిది సత్యానందం, పాలపర్తి జ్ఞానరత్నం, ప్రభుదాసు, జయమణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

పాలకోడేరు: అధికారుల సూచనలు అనుసరించి, ప్రజలకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలని పాలకోడేరు మండల తహసీల్దార్ భారతి విజయ లక్ష్మి రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని అన్నారు. ఈపోస్ మెషీన్, కాటాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏమైనా రిపేర్లు చేయాల్సి వస్తే టెక్నీషయన్ అందుబాటులో ఉంటారని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సీఎస్ డీటీ ఆది శేషయ్య, మాణిక్యాలరావు, డీలర్ల సంఘం కార్యదర్శి సోము రామకృష్ణ, కొల్లా సత్యనారాయణ, సాంబ్రాణి పద్మజ, ఎస్ఎన్‌వీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఫలితం లేని ఉపాధి పనులు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పనికి వచ్చినా ఫలితం లేకుండా పోతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి, శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ కొమ్ముగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని బహిష్కరించినట్లుగా పనులకు శ్రామికులు రావడం లేదని తెలిపారు. శ్రామికులకు ఎనిమిది వారాలుగా కూలి సొమ్ములు బకాయి ఉన్నారన్నారు. అలాగే, ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేవన్నారు. ఇప్పటికైనా, ప్రభుత్వం స్పందించి కూలి సొమ్ములు, సమ్మర్ అలవెన్స్‌లు పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బైపో ప్రసాద్, ఉండ్రాజవరపు రమేష్, కండెల్లి విజయ, కూనపో సుబ్బారావు, ఉండ్రాజవరపు మేరీ, గెడ్డం నాగమణి, కొడమంచిలి దుర్గాప్రసాద్, వీర్రాజు, కండెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నవాబుపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు పేర్కొన్నారు. మండలంలోని మాధవరం, అప్పారావుపేట గ్రామాల్లో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం అధికారి జె.విల్సన్‌బాబు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, వారానికొకసారి డ్రైడే, ఫ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు బేబి, ఎంఎల్‌హెచ్‌పీ రూత్, ఆశా కార్యకర్తలు, లక్ష్మీకుమారి, కుమారి, ఆరోగ్య సహాయకులు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మాధవరం గ్రామంలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

పడాలలో దంత వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్య నిపుణురాలు ఎస్తేరు కమల మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బ్రష్ చేయడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. దంత సమస్యలు వస్తే దాని ప్రభావం శరీరంలోని పలు అవయవాలపై పడుతుందన్నారు. దంత సమస్యలు ఉత్పన్నమైన వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. అనంతరం పలువురికి టూత్ పేస్ట్, బ్రష్, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. మానవత అధ్యక్ష, కార్యదర్శులు పచ్చా వెంకటేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, యెగ్గిన శరత్‌బాబు, చేకూరి బంగార్రాజు, కేవీ.రామారావు, గురుమూర్తి, అరుణ, పాండురంగారావు, జీవన సంధ్య వృద్ధాశ్రమ నిర్వాహకులు ఎం. కేశవ వర్మ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.



పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు బిస్కెట్లు అందజేస్తున్న దృశ్యం

పెంచిన ఆస్తి పన్ను ఉపసంహరించుకోవాలి

భీమవరం: పెంచిన ఆస్తి పన్ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం భీమవరంలో ఎం.వైకుంఠరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు తాము అధికారంలో వస్తే ప్రజలపై ఎలాంటి భారాలు వేయమని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలపై ఆస్తి విలువ ఆధారంగా 20 శాతం పన్ను పెంచిందని మండిపడ్డారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ఖజానా నింపుకోవడం కోసం ప్రజలపై ఆస్తి పన్ను భారం వేయడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచిన ఆస్తి పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.వరలక్ష్మి, సత్యనారాయణ, డి.నాగు, కె.కృష్ణ, డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

మానసిక వైద్యశాలల సందర్శన

భీమవరం: పట్టణంలోని మానసిక వైద్యశాలలను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె.రత్నప్రసాద్ సందర్శించారు. వర్మ హాస్పిటల్స్, శాంతి, ప్రశాంతి మానసిక వైద్యశాలలను సందర్శించి రోగుల మానసిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు న్యాయపరమైన సూచనలు, సలహాలు అవసరమైతే స్థానికంగా ఉన్న మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చున్నారు. కార్యక్రమంలో వర్మ హాస్పిటల్స్ మానసిక వైద్యురాలు శ్రీదేవి, శాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు జీవీ రమణరావు, ప్రశాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు మాదిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.